



దేవాదుల సొరంగం

మన మేధస్సు.. అద్భుతం




ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతున్న రామప్ప దేవాలయం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనలు, భారీ ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ ఇంజనీర్లే కీలకం
- దేవాదుల ప్రాజెక్టులో 49.6కి.మీ.ల టన్నెల్ ఓ రికార్డు
- 506 మీటర్లపైకి కొండపోచమ్మ వరకు నీటిని లిఫ్ట్ చేసేలా కాళేశ్వరం డిజైన్
- చెక్కుచెదరని నిజాంకాలం నాటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు
- మేడారం జంపన్నవాగుపై 37రోజుల్లో వంతెన నిర్మాణం మరో రికార్డు
- ఇప్పటికీ అంతుచిక్కని కాకతీయుల నాటి కళా నైపుణ్యం



నేటికీ చెక్కుచెదరని ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు

5 నేడు ఇంజనీర్స్ డే



కాళేశ్వరం ప్రాజెక్టు

Sunday Special

కాకతీయుల కాలమైనా.. ప్రస్తుతమైనా.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నో అద్భుత కట్టడాలకు నిలయం. గొలుసు కట్టు చెరువుల నుంచి నీటిని ఎత్తిపోసే నేటి తరం ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. వీటికి తోడు ఎప్పటికీ అంతుచిక్కని ఎన్నో రహస్యాల సమాహారమైన ఆలయాలు ఉన్నాయి. ఓ వైపు భూగర్భంలో అనకొండల్లా కిలోమీటర్ల కొద్ది సాగిపోయే సొరంగాలు.. మరోవైపు శిల్పకళా శోభిత ఆలయాల కట్టడాలను చూస్తే కళ్లు చెదురుతాయి. ఆహా.. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అమోఘం అనడం ఖాయం. కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిస్తే.. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్‌తో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహాద్భుతంగా అభివర్ణిస్తున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలవటం నాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. ఇలా ఎన్నో విశిష్ట కట్టడాల సమాహారమైన ఓరుగల్లు నిర్మాణాల్లో ఇంజనీరింగ్ నిపుణుల నైపుణ్యం చెక్కుచెదరనిది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సర్కారు సన్నాహాలు

గ్రామపంచాయతీ ఎన్నికలకు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శన





- ఈనెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది జాబితా ప్రదర్శనకు ఆదేశాలు
- జిల్లాలో మహిళ ఓటర్లు 2,80,079, పురుషులు 2,71,755

మహబూబాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశానికి పట్టుకొమ్మలైన గ్రామపంచాయతీల పాలకవర్గాల ఎన్నికలకు రాష్ట్రప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని సర్కార్ రంగంలోకి దింపింది. వివాదాలు లేని గ్రామ జీపీ వార్డుల వారీగా సమాచారం తెప్పించుకుని, ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఆయా గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేసింది.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ..

ఆయా ఓటర్ల జాబితాలపై ఈనెల 14వ తేదీ నుంచి 21 వరకు ఏమైన అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తుంది. 18న ఓటర్ల జాబితాపై జిల్లాస్థాయి ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, లిస్టుపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలనకు తీసుకోనున్నారు. ఇదే నెల 26న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిష్కరించి 28న తుది జాబితా ప్రకటించేందుకు జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పార్టీలకతీతంగా జరిగే పంచాయతీ ఎన్నికలు సున్నితత్వంతో కూడుకుని ఉండడంతో ఎలాంటి అజాగ్రత్తలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

473 గ్రామపంచాయతీల్లో..

మహబూబాబాద్ జిల్లాలో మొత్తం కొత్త పంచాయతీలను కలుపుకుని 487 జీపీలకు గాను 14 పంచాయతీలుమినహాయించి, 473 గ్రామపంచాయతీల్లో ముసాయిదా ఓటర్లజాబితాలు ప్రదర్శిస్తున్నారు. తొలుత జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో 461 గ్రామపంచాయతీలు ఉండగా క్రమంగా జిల్లాలోని 16 మండలాల నుంచి కొత్తగా మరోరెండు మండలాలు ఏర్పాటయ్యాయి. దీంతో మండలాలసంఖ్య 18కి పెరిగింది. అదే రీతిన 26 పంచాయతీలు కొత్తగా ఏర్పాటు చేస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామపంచాయతీల సంఖ్య 487కు పెరిగింది. కాగా, వీటిలో కోర్టు వివాదాలు, గెజిట్ లోపాలు వెరసి 14 గ్రామపంచాయతీలను మినహాయించి వివాదస్పదంలేని 473 గ్రామపంచాయతీలలో 4052 వార్డులను ఖరారు చేశారు. వీటి పరిధిలో జిల్లా వ్యాప్తంగా 5,51,858 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. ఇందులో మహిళ ఓటర్లు 2,80,079 కాగా, పురుష ఓటర్లు 2,71,755, ఇతరులు 24 మంది ఉన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమాయత్తమవుతున్నారు.

పాలకవర్గాల పదవీకాలం ముగిసి 7 నెలలు..

గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఇప్పటికే ఏడు నెలలు గడిచిపోయింది. ప్రత్యేక అధికారుల పాలనా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే త్వరితగతిన పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. వాస్తవానికి జిల్లాలో గతంలో జరిగిన ఎన్నికల సమయంలో 461 గ్రామపంచాయతీలు ఉండగా, వీటిలో 4,030 వార్డులున్నాయి. వీటికి 2019లో జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఫిబ్రవరి 2న గ్రామపంచాయతీల్లో కొత్త పాలక మండళ్లు కొలువుతీరాయి. ఈ పాలకమండళ్ల సరిగ్గా ఈ ఏడాది ఫిబ్రవరి 1తో పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రభుత్వ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.



తొర్రూరు మండలం ఫత్తేపురం గ్రామపంచాయతీలో ఓటరు లిస్టు ప్రదర్శిస్తున్న పంచాయతీ కార్యదర్శి

జిల్లాలోమొత్తం 18 మండలాల్లో 487 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, 14 పంచాయతీలు వివిధఅంశాలకు సంబంధించి వివాదాల్లో ఉండడంతో 473 పంచాయతీలకు ఎలాంటి అవరోధాలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. వీటి పరిధిలో 4052 వార్డులకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితా ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో జిల్లాలోని 461 పంచాయతీల్లో షెడ్యూల్ ఏరియాలోని 102 గ్రామపంచాయతీలను అప్పట్లో షెడ్యూల్ ట్రైబ్స్ (ఎస్టీ)లకే రిజర్వు చేశారు. వీటికి తోడు వందశాతం షెడ్యూల్ ట్రైబ్స్ జనాభా ఉన్న మరో 115 పంచాయతీలు కూడా ఎస్టీలకే రిజర్వు అయ్యాయి.

ఇక మిగిలిన నాన్‌షెడ్యూల్డ్‌లో ఉన్న 244 గ్రామపంచాయతీలలో జనాభా దామషా ప్రకారం రిజర్వేషన్లు తీయడంతో మరో 58 పంచాయతీలు ఎస్టీలకే లభించాయి. వెరసి 275 గ్రామపంచాయతీల సర్పంచ్ పదవులు ఎస్టీలకే దక్కాయి. ఇక ఎస్సీలకు 42, బీసీలకు 22 రిజర్వేషన్లు రాగా, మిగిలిన 122 పంచాయతీలను జనరల్ కేటగిరి కింద వదిలేశారు. మొత్తం సర్పంచ్ పదవుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించారు. ఈసారి రిజర్వుడ్ పంచాయతీలను వదిలేసినప్పటికి అత్యధిక పంచాయతీలు ఎస్టీలకే లభిస్తాయని రాజకీయ పరిశీలకులు అంచనా కడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో వార్డులు మొదలుకుని సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు ఉవ్విలూరుతున్న ఆశావహులు ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

పంచాయతీల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ఇలా.

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బయ్యారం	29	252	18667	19424	01	38092
చిన్నగూడూరు	09	78	5376	5381	–	10757
దంతాలపల్లి	18	166	12845	13414	01	26260
డోర్నకల్	30	256	16747	17181	02	33930
గంగారం	12	100	4530	4575	01	9106
గార్ల	20	184	14927	15539	01	30467
గూడూరు	40	346	22347	23087	01	45435
కేసముద్రం	42	380	29102	29727	–	58829
కొత్తగూడ	24	202	11566	12004	02	23572
కురవి	52	436	26085	27384	01	53470
మహ-బాద్	41	338	19146	19855	06	39007
మరిపెడ	40	332	20145	20588	–	40733
నర్సింహులపేట	23	194	11973	12442	02	24417
నెల్లికుదురు	36	322	22975	23386	03	46364
పెద్దవంగర	26	190	12407	12658	–	25065
తొర్రూరు	31	276	22917	23434	03	46354
మొత్తం	473	4052	2,71,755	2,80,079	24	5,51,858



ముల్కలపల్లిలో ఆకేరు వద్ద అధికారులతో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరద నష్టాన్ని పూర్తిగా అంచనా వేయండి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

డోర్నకల్, సెప్టెంబరు 14 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఆకేరుకు వరద పోటెత్తడంతో ముల్కలపల్లి రెవెన్యూ పరిధిలో నష్టం అంచనా వేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆకేరు వరదతో నష్టపోయిన రైతుల పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రికి నష్టపోయిన రైతులు కలిసి తమ గోడును వెల్లబుచ్చారు. అనంతరం మంత్రికి నష్టపరిహారం వెంటనే అందించే విధంగాచర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. అక్కడ్నుంచి ముల్కలపల్లి మీదుగా ఖమ్మం వెళ్లే నేషనల్ హైవే హైలెవల్ వంతెనను పరిశీలించారు. మంత్రివెంట డోర్నకల్ ఎంపీడీవో శ్రీనివాసరావు, డీటీ వెంకన్న, నేషనల్ హైవే ఈఈ యుగంధర్ ప్రత్యేక అధికారులు నర్సింహమూర్తి, రుక్మాంగదరావు ఉన్నారు.



మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ కోసం పోలీస్, డాక్టర్స్ జట్లు

ఉత్సాహంగా పోలీస్-డాక్టర్స్ క్రికెట్ మ్యాచ్

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 14 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో పోలీస్ వర్సెస్ డాక్టర్స్ జట్ల మధ్య శనివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన పోలీస్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన డాక్టర్స్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 77 పరుగులు మాత్రమే చేసింది. దీంతో డాక్టర్స్ జట్టుపై పోలీస్‌జట్టు 48 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.


నేటి నుంచి అన్నిరూట్లలో బస్సుల పునరుద్ధరణ

- మానుకోట డీఎం శివప్రసాద్

మహబూబాబాద్‌టౌన్, సెప్టెంబరు14 : వర్షాలకు రోడ్లు దెబ్బతిని మహబూబాబాద్ డిపో నుంచి వివిధ రూట్లలో నిలిచిపోయిన బస్సులను ఈనెల 15 నుంచి బస్సులను పునరుద్ధరిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ నుంచి సూర్యాపేటకు వెళ్లే బస్సులను చిన్నగూడూరు, ఎల్లంపేట క్రాస్‌రోడ్, మరిపెడ బంగ్లా మీదుగా సూర్యాపేటకు బస్సు నడిపించనున్నట్లు వివరించారు. మహబూబాబాద్ నుంచిధర్మారానికి షటిల్స్ నడుపబడునని పేర్కొన్నారు.మహబూబాబాద్ నుంచి ఖమ్మం రూట్‌లో ముల్కలపల్లి వద్ద తాత్కాలికంగా బ్రిడ్జికి మరమ్మతులు చేయడంతో బస్సులను ముల్కలపల్లి మీదుగా నడిపిస్తామని చెప్పారు. అన్నిరూట్లలో యథావిధిగా బస్సులు నడిపించేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ప్రయాణికులు గమనించాలని శివప్రసాద్ కోరారు.

108 రకాల ప్రసాదాలతో నైవేద్యం

- ఎస్వీ టవర్స్‌లో విఘ్నేశ్వరునికి భక్తుల పూజలు





ఎస్వీ టవర్స్‌లో వినాయక విగ్రహం వద్ద 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించిన భక్తులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 : జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ప్రాంతం ఎస్వీ టవర్స్‌లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శనివారం 108 రకాల ప్రసాదాలతో వినాయకుడికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. లడ్డు, గరిజలు, మైసూర్‌పాక్, అరిసెలు, సోరకాయ హల్వా, నువ్వుల లడ్డు, పల్లి లడ్డు, గులాబీజామ్, సకినాలు, కారపుపూస, పల్లి పకోడి, బీట్‌రూట్, కార బిల్లలు, సేమియా, పులిహోర తదితర 108 రకాల ప్రసాదాలను వినాయకుడి విగ్రహం ఎదుట ఉంచి పూజలు చేశారు. అంతేకాకుండా సదరు ప్రసాదాలను వినాయక విగ్రహ రూపంలో ఏర్పాటు చేశారు. ఎస్వీ టవర్స్‌లో గత మూడేళ్లుగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. పర్యావరణ పరిరక్షణేహితంగా గతంలో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా ఈ సంవత్సరం సంగారెడ్డి జిల్లా కేంద్రం నుంచి గోమయం వినాయక విగ్రహాన్ని తీసుకువచ్చి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ టవర్స్ గణేష్ ఉత్సవ కమిటీ బాధ్యులు ఎస్.లింగారెడ్డి, వెంకట్ రెడ్డి, నవీన్, నాళ్ల ఓం ప్రకాష్, నాళ్ల లక్ష్మీనర్సింహరావు, చంద్రకళ, సుధా, స్వప్న, ప్రేమలత, మంజుల పాల్గొన్నారు.

'కేసముద్రాన్ని మునిసిపాలిటీ చేయొద్దు'

కేసముద్రం, సెప్టెంబరు 14 : మండల కేంద్రాన్ని మునిసిపాలిటీగా చేయొద్దని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీగా చేస్తే దినసరి కూలీలు ఉపాధి హామీ పథకానికి దూరమై ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో డోర్నకల్, మరిపెడ మునిసిపాలిటీలను మళ్లీ గ్రామపంచాయతీలుగా మార్చాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. మునిసిపాలిటీల్లో ఇంటిపన్నులు మూడురెట్లు పెరుగుతాయని అన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులే బాగుపడుతారని, సామాన్య ప్రజలకు మునిసిపాలిటీతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దీనిపై విలీన ప్రతిపాదిత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు.



కాజీపేట మీదుగా నాగపూర్‌కు 'వందేభారత్'

- రేపటి నుంచి రైలు రాకపోకలు

కాజీపేట, సెప్టెంబరు 14 : ఈనెల 16 నుంచి కాజీపేట మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడవనుంది. ఇందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నాగ్‌పూర్-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20101) రైలు ఈ నెల 16న నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి కాజీపేట 10.04 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 12.15 నిమిషాలకు చేరుకుంటుంది. తిరిగి సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 3.20 నిమిషాలకు చేరుకుంటుంది.రాత్రి 8.20 నిమిషాలకు నాగ్‌పూర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

- సీఎస్‌ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- డీన్ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14: కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు పీజీ అభ్యర్థులంతా ఇక నుంచి తప్పనిసరిగా యూజీసీ సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణను తప్పనిసరి చేయనుంది. దేశవ్యాప్తంగా న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పీహెచ్‌డీ అడ్మిషన్లకు జాతీయ అత్యున్నత సంస్థ నిర్వహించే నెట్ పరీక్షలు తప్పనిసరి చేసింది. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలన్నింటికీ మార్గదర్శకాలను రూపొందించింది. తమ ఆదేశాల మేరకు అన్ని వర్సిటీలు పీహెచ్‌డీ అడ్మిషన్లలో ప్రత్యేక ప్రవేశ పరీక్షలు రద్దు చేసి సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత మేరకు సీట్లు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ మార్గదర్శకాల నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు విధి విధానాలు రూపొందించేందుకు కేయూ సోషల్‌సైన్స్ డీన్ తాళ్లపల్లి మనోహర్, చైర్మన్‌గా జియాలజీ విభాగా. దిపతి మల్లికార్జున్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీన్ ఎం సదానందం, అకాడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కమిటీ ఇప్పటికే యూజీసీ నిబంధనలు ఏమీ చెబుతున్నాయి. మార్గదర్శకాలు ఏవిధంగా రూపొందించాలనే అంశంపై చర్చించింది.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్ రద్దు

కేయూ ప్రత్యేకంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఎలాంటి ఎంట్రెన్స్ నిర్వహించదు. జాతీయ స్థాయి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు అన్ని విభాగాల్లో మొట్టమొదటి ప్రాధాన్యత కల్పించి అడ్మిషన్లు కల్పిస్తారు. జేఆర్ఎఫ్ తర్వాత నెట్ ఉత్తీర్ణతలో వచ్చిన మెరిట్ మేరకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఏడాదికి రెండు దఫాలుగా జాతీయస్థాయిలో నెట్ పరీక్షలు జరుగుతాయి. నెట్ పరీక్షల ఫలితాలు రాగానే అర్హులైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు చేసుకుంటే అడ్మిషన్లు కల్పించే వీలుంది. అభ్యర్థులు ప్రత్యేకంగా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. నెట్ పాసైన వెంటనే అడ్మిషన్లు పొందవచ్చు.

జేఆర్ఎఫ్, నెట్‌కు కుస్తీ పట్టాల్సిందే..

జాతీయస్థాయిలో ప్రతీ సబ్జెక్టులో నెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంగ్లిష్, హిందీ భాషల్లో రెండు పేపర్లుంటాయి. మొదటి పేపర్ జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రాథమిక గణిత సామర్థ్యాలు, లోక పరిజ్ఞాన అంశాలుంటాయి. మొదటి పేపర్‌లో అర్హులైన అభ్యర్థుల రెండో పేపర్‌ను వాల్యూయేషన్ చేస్తారు. రెండో పేపర్ మొత్తం సంబంధిత అభ్యర్థి ఎంచుకున్న అంశంలో ఉంటుంది. సైన్స్ అభ్యర్థులకు సీఎస్ఐఆర్ అని, ఆర్ట్స్, సోషల్ సైన్స్ ఇతర సబ్జెక్టుల అభ్యర్థులందరికీ నెట్ పరీక్షలని పిలుస్తారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో ఏడాదికి రెండు దఫాలుగా యూజీసీ సీఎస్ఐఆర్, నెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. పీజీ ఫైనలియర్‌లో ఉన్న అభ్యర్థులను కూడా నెట్, సీఎస్ఐఆర్ ప్రవేశ పరీక్షలకు అనుమతిస్తారు. జేఆర్ఎఫ్‌కు వయసు పరిమితి విధించారు. నెట్ ఉత్తీర్ణతకు మాత్రం ఎలాంటి వయసు పరిమితి ఉండదు. ఉత్తీర్ణులయ్యే వరకు పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించారు. నెట్ పరీక్షల కోసం కేయూలో ఉచితంగా కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొత్త వీసీ రాగానే నోటిఫికేషన్

యూజీసీ నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం రూపొందించిన విధి విధానాల నోటిఫికేషన్ కొత్త వీసీ రాగానే జారీ కానుంది. యూజీసీ నిబంధనలన్నీ ఉన్నది ఉన్నట్లుగా అడాప్ట్ చేసుకునే అధికారం వీసీకి ఉంది. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. వీసీలు రాగానే యూజీసీ పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రక్రియకు అధికారికంగా పచ్చజెండా ఊపుతారని వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి.

పురుగుల మందు తాగిన వృద్ధురాలి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 14 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్‌లోని లచ్యాతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లచ్యాతండాకు చెందిన తేజావత్ బీబు (60) సుభాష్ వీధిలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి లింగంపల్లి రాజేష్ ఇంటిలో పనిచేస్తుంది. ఈనెల 13న రాజేష్ ఇంటిలో రోజువారి పనులు ముగించుకుని తన ఇంటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం మళ్లీ రాజేష్ ఇంటికి రాగా ఇంట్లో ఉన్న రూ.15 వేలు నగదు పోయిందని, ఆమె తీసిందని ఆవేశంతో రాజేష్, అతడి భార్య అమల బీబుపై చేయి చేసుకున్నారు. మనస్తాపం చెందిన బీబు ఇంటికి వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు రమేష్ బీబును చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బీబు మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిన్నెల వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

బయ్యారం, సెప్టెంబరు 14 : వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నామాల పాడు పంచాయతీ ధర్మాపురానికి చెందిన పూనెం వెంకన్న (45) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్య శృతితో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అనంతరం ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు వెతక సాగారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలోని జిన్నెల వాగు ఒడ్డున వెంకన్నకు సంబంధించిన చెప్పులు, టవల్ కనిపించడంతో ప్రమాదవశాత్తు వెంకన్న వాగులో గల్లంతై ఉంటాడనే అనుమానంతో రెండురోజుల పాటు గజ ఈతగాళ్లతో వెతికించారు. శనివారం వెంకన్న మృతదేహం లభ్యమైంది. మృతురాలి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.



కుడా చైర్మన్ వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: హనుమకొండలో ప్రారంభమయ్యే కాళోజీ కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాసంస్థలకు ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ నాటక కళా సమితి నాయకులు, కళాకారులు శనివారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కుడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆడిటోరియంలో కళాకారులు మేకప్ చేసుకునేందుకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, స్టేజీ డెకరేషన్, గ్రీన్‌రూమ్, రిహార్సల్స్ గదులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, కాకతీయ నాటక కళాపరిషత్ జిల్లా అధ్యక్షుడు రాదారపు సంజీవరెడ్డి, కళాకారులు చక్రపాణి, బాలాజీ, రమేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, బిక్షపతి, శంకర్, గణేశ్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు.

నిమజ్జన వేళ.. మద్యం షాపులు బంద్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఈనెల 16వ తేదీ ఉదయం 6గంటల నుంచి 17వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు మద్యం షాపులు బంద్ చేయాలన్నారు. మద్యం సరఫరా చేసే బార్‌లు, క్లబ్‌లు, హోటళ్లు మూసివేయాలని అంబర్ కిషోర్‌ఝా సూచించారు. ఎవరైనా మద్యం షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు ఆకాశవాణిలో ఎంపీ కావ్యతో ముఖాముఖి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: వరంగల్ ఆకాశవాణి ఎఫ్ఎం బ్యాండ్ 103.5 మెగా హెడ్జ్‌పై ఆదివారం ఉదయం 7.15నిమిషాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్యతో ముఖాముఖి కార్యక్రమం ప్రసారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఇల్లెందుల రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడియం కావ్య జీవన ప్రయాణంలో అనేక విషయాలు.. అనే అంశంపై ప్రసారం ప్రారంభం అవుతుందని తెలిపారు.

తైక్వాండోలో శశాంక్‌కు కాంస్యం

న్యూశాయంపేట, సెప్టెంబరు 14: తమిళనాడులో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో న్యూశాయంపేటకు చెందిన గుజ్జేటి త్యాగరాజు కుమారుడు శశాంక్ కాంస్య పతకం సాధించాడు. శనివారం టోర్నీ నిర్వాహకుల నుంచి శశాంక్ కాంస్య పతకం అందుకున్నాడు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శశాంక్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ వీ నరసింహ పర్యవేక్షణలో 6 నెలలు శిక్షణ తీసుకున్నాడు.



నిర్వాహకుల నుంచి కాంస్య పతకం తీసుకుంటున్న విద్యార్థి శశాంక్

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ ఇంజనీర్లే కీలకం
- నేడు ఇంజనీర్స్ డే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కళ్లు చెదిరే ఎన్నో కట్టడాలకు నెలవు ఉమ్మడి వరంగల్ జిల్లా. కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువుల నుంచి ఈ తరం వారు నిర్మించిన ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. అంతేకాదు ప్రపంచాన్ని సైతం అబ్బురపరిచే ఆలయాల నిర్మాణం, దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్ నిర్మాణంతో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహా అద్భుతంగా చెబుతున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికి చెక్కు చెదరకుండా నిలవటం ఆనాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. అంతేకాదు కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిచింది.

అసియాలోనే అతిపెద్ద టన్నెల్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయనిగా భావించే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ అద్భుతంగా చెబుతారు. 2003లోనే మన ఇంజనీర్లు రూపొందించిన దేవాదుల ఎత్తిపోతల పథకానికి అసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పేరుంది. మూడు దశలుగా విభజించి నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాదంతా నీటిని ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. సుమారు 6లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఈ దేవాదుల ప్రాజెక్టులో భాగంగా మూడవ దశలో టన్నెల్‌ను నిర్మించారు. ఈ అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్ల వరకు నిర్మించారు. ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ వందలాది మంది ఇంజనీర్ల కృషితో విజయవంతంగా సుదీర్ఘకాలం పాటు టన్నెల్ నిర్మాణం సాగింది. ఈ సొరంగం నుంచి దేవాదుల ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించనున్నారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న బావితరహాలో నిర్మించగా, 141 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన పంపుహౌస్ కూడా ఓ రికార్డే. ఇంత పెద్ద సొరంగం నిర్మాణాన్ని డిజైన్ చేసిన ఇంజనీర్ల ప్రతిభను ప్రశంసించని వారు లేరు. టన్నెల్ పనులు ఆలస్యమైనా ఇంత పెద్ద సొరంగాన్ని తవ్వి గోదావరి జలాలను తరలించటం సాధారణ విషయం కాదనే చర్చ ఉంది. ఇందులో వినియోగించిన యంత్రాలు విదేశీవే అయినప్పటికి మేధస్సు మాత్రం మన ఇంజనీర్లదే కావడం విశేషం.

ఇచ్చంపల్లి... అచ్చాహై..

నిజాం కాలంలోనే అప్పటి హైదరాబాద్ రాష్ట్రంతో పాటు



మేడారం జంపన్న వాగుపై నిర్మించిన జంట వంతెనలు

మధ్యప్రదేశ్, మహారాష్ట్రల సాగు, తాగు నీరు, విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై ఈ భారీ ప్రాజెక్టుకు నిజాం సర్కారు శ్రీకారం చుట్టింది. 1860లోనే ఫ్రెంచ్ దేశానికి చెందిన 30మంది ఇంజనీర్ల సహకారంతో హైదరాబాద్ ఇంజనీర్లతోపాటు 3వేల మందికి పైగా కూలీలు ఈ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెంది పనులు చేస్తున్న 20ఫ్రెంచ్ ఇంజనీర్లు, 2వేల మందికి పైగా కూలీలు మృత్యువాతపడ్డారు. దీంతో ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే వందేళ్లు దాటిన ఇప్పటికి ఇచ్చంపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న నాటి కట్టడాలు చెక్కుచెదరలేదు. గోదావరిలో రాళ్లతో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇంకా పటిష్ఠంగానే ఉంది. చత్తీస్‌గఢ్ వైపు చేపట్టిన బండ్ ఇంకా బలీయంగా కనిపిస్తుందంటే నాటి ఇంజనీరింగ్ తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

జంపన్నవాగుపై వంతెన ఓ అద్భుతం..

మేడారం జాతరలో 2002కు ముందు జంపన్నవాగుపై ఎలాంటి వంతెనలు లేవు. దీంతో భక్తులు వాగు దాటి జాతరకు వచ్చేవారు. తాత్కాలికంగా పైపుల అమర్చి, వాటిపై ఇసుక బస్తాలను వేసి రోడ్డు వేసేవారు. అయితే 2002లో టీడీపీ హయాంలో అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.1.89కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో నక్సలైట్ల నుంచి బెదిరింపులు వచ్చినా తట్టుకుని ఇంజనీర్లు మేడారం అడవుల్లోనే మకాం వేసి 37రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. అతితక్కువ కాలంలో ప్రతికూల పరిస్థితుల్లో ఇంజనీర్లు తమ ప్రతిభ చాటారు. 2014లో మరో వంతెనను ఇంజనీర్ల చాలెంజ్‌గా తీసుకుని దాన్ని కూడా 37రోజుల్లోనే పూర్తి చేసి మొదటి వంతెన రికార్డును సమం చేశారు. మన ఇంజనీర్ల కృషితో నిర్మాణమైన జోడు వంతెనలు మహాజాతరకు వన్నె తెస్తున్నాయి.

నేడు ఇంజనీర్స్ డే

ఏటా సెప్టెంబరు 15న ఇంజనీర్స్ డే జరుపుకొంటారు. తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్నాటకలోని ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబరు 16న జన్మించారు. మైసూరు దివాన్‌గా 1912 నుంచి 1919 వరకు పని చేశారు. దేశంలో అనేక నదులపై వంతెనలు, ఆనకట్టలను నిర్మించి నీటిపారుదల, తాగునీరు పథకాల ద్వారా జలవనరులను సద్వినియోగానికి కృషిచేసిన ఆయనకు కర్నాటకలోని కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణం పేరు తెచ్చింది. ఇక ఆయన హైదరాబాద్ డ్రెయినేజీ వ్యవస్థకు రూపకల్పన చేశారు. విశాఖపట్నం పోర్టు సముద్రం వల్ల కోతకు గురికాకుండా చేయగలిగారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గౌరవిస్తూ ఏటా ఆయన జయంతి రోజున ఇంజనీర్స్‌డేగా జరుపుకొంటున్నారు.

ప్రపంచంలోనే గొప్ప డిజైన్ కాళేశ్వరం సొంతం

కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుత నిర్మాణం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ ఇంజనీర్ల నైపుణ్యం.. మేధస్సు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఉన్న ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఇంజనీర్లు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్న ప్రాణహిత నది నీటిని మళ్లించేలా ఈ రీ డిజైన్ జరిగింది. సముద్ర మట్టానికి మేడిగడ్డ 100 మీటర్ల ఎత్తులో ఇది ఉండగా.. ఇక్కడి నుంచి 624మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎత్తిపోయాలి. అంటే సుమారుగా ఆర కిలో మీటర్‌కు పైగా ఎత్తుకు నీటిని ఎత్తిపోసేలా కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇది సాగునీటిరంగంలోనే ఓ గొప్ప ఆవిష్కరణగా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు, ఇతర కారణాలపై ఆరోపణలు, విమర్శలు ఉన్నా మన ఇంజనీర్ల పనితీరు మాత్రం అద్భుతమనే చర్చ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ సవాల్‌గా తీసుకున్న ఇంజనీర్లు ప్రాజెక్టు పూర్తి చేయటమే లక్ష్యంగా కుటుంబాలను కూడా వదిలి పనిచేశారు. ఎండ, వాన, చలి, రాత్రి, పగలు అనేది లేకుండా మూడు షిఫ్టుల్లో పనులు చేశారు. ఇంటి వద్ద ఎవరికైనా అనారోగ్యం వచ్చినా 'ఎలాగోలా అడ్జెస్ట్ చేసుకోండి. ఇక్కడ పని బాగా ఉంది. అర్థం చేసుకొండి' అంటూ తమ వారికి సర్ధిచెప్పుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఇంజనీర్లు గుర్తు చేసుకుంటున్నారు. మేధస్సు మాత్రమే కాదు వారి అంకుఠిత దీక్ష కూడా అద్భుతమేనని మన్ననలు అందుకున్నారు.

కాకతీయ ఇంజనీరింగ్ సూపర్...

ఇసుక పునాదులు.. నీటిపై తేలియాడే ఇటుకలు.. భూకంపాలను తట్టుకునేలా శాండ్‌బాక్స్ సాంకేతికతతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. ఇప్పటి ఇంజనీర్లకు కూడా అంతు చిక్కని సాంకేతికత కాకతీయులది. ప్రపంచవ్యాప్త వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణం మహా అద్భుతంగా ఇంజనీర్లు పేర్కొంటారు. ఇసుక పునాదులతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. శాండ్‌బాక్స్ టెక్నాలజీతో రామప్పతో వెయ్యి స్తంభాల ఆలయాన్ని నిర్మించారు. ఎంత పెద్ద భూకంపాలు వచ్చిన తట్టుకునేలా ఈ శాండ్‌బాక్స్ టెక్నాలజీని అప్పటి ఇంజనీర్లు వినియోగించినట్టు చెబుతారు. అంతేకాకుండా నీళ్లలో తేలియాడే ఇటుకలను కూడా రామప్ప ఆలయ గోపురంపైన వాడారు. ఏనుగు పేడ, తవుడు, కరక్కాయ, చెట్ల జిగురుతో ఇటుకలను తయారు చేసి గోపురం నిర్మాణానికి వినియోగించారు. ఇప్పటికీ నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురం చెక్కుచెదరకుండా ఉంది. ఇది అప్పటి కాకతీయ ఇంజనీర్ల సత్తా. అంతేకాకుండా వేలాది గొలుసుకట్టు చెరువుల నిర్మాణం కాకతీయ ఇంజనీర్ల మేదస్సుకు నిదర్శనంగా నిలుస్తాయి. ఓరుగల్లు గడ్డపై ఇంజనీర్ల ఆమోఘ ప్రతిభను కనబరిచారు.





మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హరికోట్ల రవిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలి

రాంనగర్, సెప్టెంబరు 14: మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన హరికోట్ల రవి అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరిపి అతడిపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన టీఎస్ఎఫ్, డీఎంఎస్ఏ నేతలు సుదీర్ఘకాలం వరంగల్‌లో పనిచేసిన రవి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నేతలు డి.నరేష్, కె.సునిల్, వంశీకృష్ణ ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

31వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబా రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.31వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

జీవిత భాగస్వామికో ప్రశంస..

- హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్
- 'ఆమె' శ్రమను గుర్తించేది మాత్రం అతితక్కువ మందేనట
- కొంత సమయం కూడా మాట్లాడని వారెందరోనని అభిప్రాయాలు
- నేడు భార్యను ప్రశంసించే రోజు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భార్య.. భర్తలో సగభాగమే కాదు. ప్రతీ కష్టంలోనూ తోడుండే ఏకైక బంధం. మూడు ముళ్లు పడినప్పటి నుంచి జీవిత చరమాంకం వరకు తోడుగా వచ్చే భార్య భర్త కష్టసుఖాలను అర్థం చేసుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తుంది. అలాంటి భార్య శ్రమను గుర్తించే మగవారు మాత్రం అతితక్కువ మందే ఉంటున్నారట. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అసలు భార్యతో కొంత సమయం కేటాయించి మనసువిప్పి మాట్లాడని వారు ఎందరో ఉన్నారట. అయితే కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుంటూ ఎంతో కష్టపడే భార్య.. తన భర్త నుంచి ఒక్క ప్రశంస వస్తే చాలు అనుకుంటుందట. ఆ ఒక్క ప్రశంసతో తన కష్టాన్నే మరిచిపోతుందట. అందుకే ఏటా సెప్టెంబరు నెలలో వచ్చే మూడో ఆదివారాన్ని భార్యను ప్రశంసించే రోజులుగా జరుపుకొంటున్నారు. వాస్తవానికి ఈ రోజును ఎందుకు, ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారో తెలియదు కానీ.. 2006 సెప్టెంబరు మూడో ఆదివారం నుంచి అధికారికంగా అంతర్జాతీయంగా భార్యను ప్రశంసించే రోజు నిర్వహిస్తున్నారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఇది అంతగా వెలుగులోకి రాలేదు కానీ కొన్ని దేశాల్లో మాత్రం భర్తలు తమ భార్యలతో ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది.

లైఫ్‌లో బెటర్ హాఫ్..

మన సంస్కృతి సంప్రదాయాల్లో భార్యకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆమె లేని జీవితాన్ని ఊహించుకోలేం. ఊహించుకోండి.. నిత్యం ఇంటి పనులే కాదు భర్త, పిల్లల ఆలనాపాలన, కుటుంబ పెద్దల బాగోగులు చూసుకునే క్రమంలో తెల్లవారింది మొదలు నిద్రపోయే వరకు ఎంతో శ్రమిస్తుంటారు. ప్రస్తుతమైతే మగవారితో సమానంగా ఉద్యోగ, వ్యాపార తదితర బాధ్యతల్లోనూ రాణిస్తున్నారు. ఈ క్రమంలో వారు పడుతున్న శ్రమకు ప్రతిఫలంగా భర్త నుంచి ప్రశంస అందితే చాలని చాలామంది మహిళలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ విషయంలో భర్త నుంచి ఏమాత్రం ఓదార్పు లేదా ప్రశంస దక్కటం లేదని చాలా మంది ఆవేదన చెందు తుండటం గమనార్హం. పెళ్లి ఎప్పుడైందన్నది కాకుం డా భార్యను ఒక్కసారి మెచ్చుకోగలిగితే.. అంత కన్నా హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్ ఇంకేం ఉండదని, అదే జీవితంలో బెటర్ హాఫ్ అని అభిప్రా యపడుతున్నారు.

● భాగస్వామి తాను పడిన శ్రమను మరిచిపోయేలా ప్రశంసించడమే కాదు వారు ఎంతో ఇష్టపడే బంగారు ఆభరణాలు, చీరలు, ఇతర సౌందర్య సాధనాలను బహుమతిగా ఇవొచ్చు. లేదంటే వంట నుంచి ఈ ఒక్క రోజున విశ్రాంతి ఇచ్చి భర్త ఆమెకు ఇష్టమైన వంటలు చేసి పెట్టొచ్చు. లేదంటే ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లి, తనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ సర్‌ప్రైజ్ చేయవచ్చు. పువ్వులు, చాక్లెట్లు ఇలా వారికి నచ్చిన వాటితో ట్రీట్ ఇవ్వాలి. ఆమెను పొగుడుతూ ఓ కవితను రాయవచ్చు.

అంతేకాదు సోషల్‌మీడియాను వేదికగా చేసుకుని ఆమెను ప్రశంసిచొచ్చు. వైవాహిక జీవితం ప్రారంభ రోజుల నుంచి ఇప్పటి వరకు ఉన్న జ్ఞాపకాలు, ఫొటోలను ఒక పుస్తక రూపంలో తయారు చేసి బహుమతిగా ఇవ్వొచ్చు. రోజంతా వారితోనే పూర్తి సమయం కేటాయించగలిగితే.. ఆ ఒక్క రోజును వారు ఏడాదంతా గుర్తుంచుకుని కుటుంబబాధ్యతల్లో తాము ఎదుర్కొనే కష్టాలను సైతం మరిచిపోగలరని నిపుణులు చెబుతున్నారు.



కల్వర్ట్‌లో దిగి ఇక్కట్లు పడుతున్న ప్రయాణికుడు

కల్వర్ట్ ధ్వంసం.. ప్రయాణికుల ఇక్కట్లు

చిన్నగూడూరు, సెప్టెంబరు 14 : మండలంలోని ఉగ్గంపల్లి, నర్సింహులపేట మండలం ముంగిమడుగు గ్రామాల మధ్య ఉన్న కల్వర్ట్ ఇటీవల కురిసిన భారీ వానలతో ఆకేరు వరద ఉధృతికి ధ్వంసమైంది. దీంతో ఇరు మండలాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తారు చెదిరిపోయి, మట్టి ఎగిరిపోయి వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. దెబ్బతిన్న రోడ్డుపై ప్రయాణికులు ప్రమాదం అంచున వాహనాలతో కల్వర్ట్‌లో దిగి ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్య తీవ్రత దృష్ట్యా అధికారులు స్పందించి, త్వరితగతిన కల్వర్ట్ పునరుద్ధరణ పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నష్టం అంచనా రూ.5.05 కోట్లు

● ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీసీ డ్రైన్‌లు, రోడ్లు, కల్వర్టులు ధ్వంసం ● ప్రభుత్వానికి నివేదికలు అందించిన మానుకోట మున్సిపాలిటీ అధికారులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 : జిల్లా కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టం వాటిల్లింది. పట్టణం చుట్టూ నీళ్లు రావడంతో ప్రజలు అతలకుతలమయ్యారు. ఖమ్మం పట్టణం తర్వాత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనే అత్యధిక వర్షం కురవడంతో ఈ ప్రాంతమంతా జలమయమైంది. చాలాచోట్ల శివారు కాలనీలు జలమయంగా మారిపోయాయి. రోడ్లన్నీ బురదమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మహబూబాబాద్ జిల్లాలో పర్యటించి, కలెక్టరేట్‌లో అధికారులతో వర్షాలతో జరిగిన నష్టం తీసుకున్న చర్యలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని 36 వార్డుల్లో అధికారులు పర్యటించిన నష్టాన్ని అంచనా వేశారు. మునిసిపాలిటీలో రోడ్డు, కల్వర్టులు, డ్రైనేజీలు ఇతరత్రా డ్యామేజీతో మొత్తంగా రూ.5.05 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనాలు రూపొందించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

నష్టం అంచనా ఇలా..

మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో ఆగస్టు 31 నుంచి వరుసగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో 23 ప్రాంతాలు నష్టం వాటిల్లింది. రహదారులు, అంతర్గత రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. పట్టణంలో 0.23 కిలో మీటరు మేర సీసీ రోడ్లు దెబ్బతినగా రూ. 30.04 లక్షల నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. బీటీ రోడ్డు 0.87 కిలోమీటరు మేర రూ.45 లక్షలు, మెటల్ రోడ్ 0.38 కిలో మీటరు మేర రూ.3.16 లక్షలు, 28.80 కిలో మీటర్ల మేర ఇతర (మట్టి) రోడ్లు రూ. 2.51 కోట్లు నష్టం కాగా మొత్తంగా రూ.3కోట్ల 29 లక్షల 86వేల నష్టం జరిగినట్లు గుర్తించారు. అదే విధంగా 0.14 కిలోమీటర్ మేర డ్రైన్లు రూ.4.47 లక్షలు, నాలుగు కల్వర్టులు ధ్వంసం కాగా రూ.51.63 లక్షలు, 1647 వీధి దీపాలకు గాను రూ.61.65 లక్షలు, 0.80 కిలో మీటర్ మేర తాగునీటి పైపులైన్ దెబ్బ తినగా రూ.7.92 లక్షలు, ఫిల్టర్‌బెడ్ డ్యామేజ్‌కు రూ.50 లక్షలు వెరసీ మొత్తంగా మునిసిపాలిటీ పరిధిలో రూ.5.05 కోట్లమేర ఆస్తినష్టం వాటిల్లినట్లు నివేదికలు అందించారు.



బంధం చెరువు వద్ద దెబ్బతిన్న రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు (ఫైల్)

దెబ్బతిన్న రోడ్లు, వరద ప్రాంతాల సందర్శన..

మునిసిపాలిటీ పరిధిలో దెబ్బతిన్న రోడ్లు, వరద ముంపు ప్రాంతాలను మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి గురువారం సందర్శించారు. బంధంచెరువు వద్ద కోతకు గురైన రోడ్డు మరమ్మత్తులు చేపట్టేందుకు అధికారులతో కలిసి పరిశీలించారు. 17వ వార్డు పరిధిలోని రామన్నపేట కాలనీలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును పునరుద్ధరించేందుకు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్ పాల్గొన్నారు.



గంజాయి నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ జగదీష్

5.7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నపోలీస్‌లు

నెల్లికుదురు, సెప్టెంబరు 14 : అక్రమంగా తరలిస్తున్న 5.7 కిలోల గంజాయిని నెల్లికుదురు పోలీస్‌లు శనివారం పట్టుకున్నారు. తొర్రూరు సీఐ జగదీష్ గంజాయి నిందితుల వివరాలు వెల్లడించారు. ఓడిశా రాష్ట్రం, మాల్కాంజిరి జిల్లా, నిలాకంబారి మండలం, మిటిపెల్లి గ్రామానికి చెందిన నరేంద్రకైలా, బపన్ రాయ్‌లు ఇద్దరు కలసి రూ. 1,26,750 విలువ చేసే 5.7 కిలోల గంజాయిని బైక్‌పై మహబూబాబాద్ నుంచి నెల్లికుదురు మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో నెల్లికుదురు క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై రమేష్ బాబుతో పాటు పోలీస్‌లు పట్టుకొని సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు తెలిపారు.



మహబూబాబాద్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి



మానుకోట పట్టణంలో గణేష్ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న రూరల్ సీఐ సర్వయ్య



చిన్నగూడూరు మండల కేంద్రంలో గణనాథుడి పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



మహబూబాబాద్‌లో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

కొనసాగుతున్న విఘ్నేశ్వరునికి పూజలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 14 : పట్టణ శివారు గిరిప్రసాద్‌నగర్ కాలనీలో వినాయక విగ్రహం వద్ద స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడి విగ్రహం వద్ద నారికేళం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించాలన్నారు. ఈనెల 16న మహబూబాబాద్ పట్టణంతో పాటు మునిసిపాలిటీ విలీన గ్రామాల విగ్రహాలను కూడ బస్టాండ్ ప్రాంతంలోని నిజాం చెరువులో నిమజ్జనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్, దౌలాగర్ శంకర్, అంబాల శివకుమార్, పెద్దబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● మునిసిపల్ 23వ వార్డు పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ మార్నేని శ్రీదేవిరఘు ప్రారంభించారు. అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మహామిన్న అని చెప్పారు. ఈకార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రాపోలు వీరస్వామి, తిప్ప రవి, దైద మధు, మామిడాల సత్యనారాయణ, పొలిశెట్టి సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ పట్టణంలో భరత్ యువసేన ఆధ్వర్యంలో జీలుగుల భాస్కర్ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రూరల్ సీఐ సర్వయ్య ప్రారంభించారు. తొలుత వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఖైరతాబాద్ వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే పూజలు..

ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన శ్రీసప్తముఖ మహాగణపతి విగ్రహం వద్ద స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఉమా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహాగణపతిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని మహాగణపతిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు.

● మహబూబాబాద్ గౌతమి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహం వద్ద విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్నేని రఘు, మార్నేని కిరణ్, ఎద్ల వేణు, బానోత్ రవికుమార్ పాల్గొన్నారు.

● చిన్నగూడూరు : మండల కేంద్రంలోని బోడ్రాయి బజార్‌లో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు యుగేందర్ రెడ్డి, రఘువీరారెడ్డి, గునిగంటి కమలాకర్ పాల్గొన్నారు. ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసినగణనాథుడి వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై ఝాన్సీ, గాడిపెల్లి శ్రీశైలం, దొంగరి నర్సయ్య, పిల్లి వీరన్న, ముత్యం సత్యం, యాకాంబ్రం, గుండాల వెంకన్న, బి.యాకయ్య, మహేష్, శ్రావణ్, కిష్టయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య



మద్దెబోయిన తులసి (ఫైల్)

మరిపెడ, సెప్టెంబరు 14 : ఉరేసుకొని ఓ యువతి మృతి చెందిన సంఘటన శనివారం మరిపెడ మునిసిపల్ పరిధి ఇందిరానగర్ కాలనీలో చోటు చేసుకుంది. అదనపు ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం. ఆ కాలనీకి చెందిన మద్దెబోయిన తులసి (19) ఇంట్లో ఎవ్వరులేని సమయంలోఇంటి దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొంది. యువతి తండ్రి ఆరేండ్ల క్రితం మృతి చెందాడు. తల్లి స్వాతి, కుమార్తె తులసితో కలిసి ఇళ్లల్లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మృతురాలు తులసికి కొద్ది రోజుల క్రితం పెళ్లి కుదిరింది. నవంబరులో పెళ్లి జరగాల్సి ఉండగా, వివాహానికి కావాల్సిన డబ్బులు లేవు. దీంతో జీవితంపై విరక్తి చెంది తీవ్ర మనస్తాపానికి గురైన తులసి ఈ అఘాయిత్యానికి పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక



మహేశ్‌గౌడ్ కార్యదర్శి



రమేష్‌రెడ్డి అధ్యక్షుడు

మరిపెడ, సెప్టెంబరు 14 : పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నికను శనివారం మరిపెడ బంగ్లాలోని సీతారాంపురం హైస్కూల్లో ఆ సంఘ సభ్యులు సమావేశమై ఏకగ్రీవకంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుడితి ఉపేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంక బద్రినారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా కీసర రమేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లింగాల మహేశ్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షులుగా జి.వెంకన్న, వెంకటయ్య, మహిళ ఉపాధ్యక్షురాలుగా రజిత, ఉపాధ్యక్షులుగా జి.వెంకన్న, లెనిన్, మహిళ కార్యదర్శిగా జహెదా బేగం, కార్యదర్శులుగా యాదగిరి, భరత్, విజయ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా వెంకట్‌రెడ్డి, సంజీవ వ్యవహరించారు. సంఘ నాయకులు లింగయ్య, రాంమోహన్, కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల పరిశీలన

చిన్నగూడూరు, సెప్టెంబరు 14 : మండల పరిధిలోని విద్యుత్ పునరుద్ధరణ పనులను సీఈ కిషన్, ఎస్ఈ నరేష్ డీఈ మధుసూదన్ సంయుక్తంగా శనివారం పరిశీలించారు. ఆకేరు వరదల్లో కొట్టుకుపోయిన 33 కేవీ, చిన్నగూడూరు లైన్, మన్నెగూడెం గ్రామానికి విద్యుత్, 200 స్తంభాలు, 18 ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసినట్లుగా తెలిపారు. వినియోగదారులు, రైతులతో సమావేశమై పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ నవ్య, సబ్ ఇంజనీర్ నిహాల్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



శ్రీనివాస్ కార్యదర్శి



జనార్దన్ అధ్యక్షుడు

తొర్రూరు, సెప్టెంబరు 14 : టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం తొర్రూరులోని టీపీటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు.

టీపీటీఎఫ్ తొర్రూరు మండల అధ్యక్షుడిగా కొండం జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా కొలుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కాటం అనంతరెడ్డి, కె.జ్యోతి,కార్యదర్శులుగా శ్రీనివాస్, యాకమధు, శ్రీనివాస్, జిల్లా కౌన్సిలర్‌లుగా తండా ప్రభాకర్, సూరం ఉపేందర్‌రెడ్డిలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సబియాభాను, బోగ సంపత్, శ్రీనివాస్, స్వామి, బాలునాయక్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు14 : రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, గ్రామస్థుల కథనం ప్రకారం. కంఠాయపాలెంకు చెందిన ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) ఈరబోయిన రమేశ్ (30) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రోజు మాదిరిగానే తొర్రూరు ఎంపీడీవో కార్యాలయంలో విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో తొర్రూరు మునిసిపాలిటీ చెత్తాచెదారం తరలిస్తున్న ట్రాక్టర్ నుంచి పరుపు కంఠాయపాలెం-తొర్రూరు రోడ్డుపై పడింది. దీనిని గమనించని రమేశ్ బైక్ పరుపుకు తగలడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. రమేశ్‌కు తలకు తీవ్రమైన గాయం కావడంతో స్థానికులు ఆయనను ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషయమించి మృతి చెందాడు. మృతుడికి భార్య రచన, ఇద్దరుకుమార్తెలు మన్విత, ఆరాధ్య, తల్లిదండ్రులు మల్లయ్య, ఐలమ్మ ఉన్నారు. ఈ విషయంపై ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా, మృతుడి అన్న కుమారుడు ఈఠశ్రీపాల్ ఫిర్యాదు మేరకు మునిసిపల్ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



రమేష్ (ఫైల్)

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి..

● తొర్రూరు, సెప్టెంబరు 14 : బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తొర్రూరులోని గాంధీ సెంటర్‌లో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. కంటాయపాలెంకు చెందిన ఇ.రమేష్ ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని గ్రామానికి వెళ్తుండగా, పట్టణ శివారులో మూలమలుపు వద్ద మునిసిపల్ సిబ్బంది చెత్త వేయడంతో చెత్తలో ఉన్న పరుపు బండి హ్యాండిల్‌కు తగిలి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్ల వెంట చెత్త వేయడం వల్లే ప్రమాదం జరిగి రమేశ్ మృతి చెందాడని బాధిత కుటుంబానికి మునిసిపల్ పాలకవర్గ సభ్యులు, కమిషనర్ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా సంఘటనా స్థలానికి సీఐ జగదీష్ చేరుకుని మునిసిపల్ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ టీచర్ మృతి



రవికుమార్ (ఫైల్)

పెద్దవంగర, సెప్టెంబరు 14 : మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గొదుమల్ల రవికుమార్ (53) గుండెపోటుతో వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని మామునురులో శనివారం మృతి చెందాడు. గత రెండేళ్లుగా రవికుమార్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నడని, విద్యార్థులమనసులో తనదైన శైలిలో చేరగని ముద్ర వేసుకున్నారని పలుఉపాధ్యాయుల సంఘాల నాయకులు కొనియాడారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

దాట్లలో గుండెపోటుతో రైతు మృతి



ఉప్పలయ్య (ఫైల్)

దంతాలపల్లి, సెప్టెంబరు 14 : దాట్లకు చెందిన యువరైతు కొమ్ము ఉప్పలయ్య (34) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం. ఉప్పలయ్య తెల్లవారు జామున స్వల్ప అస్వస్థతకు గురికావడంతో వెంటనే స్థానికులు ప్రైవేటు వాహనంలో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, వైద్యపరీక్షలు చేయకముందే ఉప్పలయ్య తుది శ్వాస విడిచాడు. ఉప్పలయ్య వ్యవసాయంతోపాటు దాట్లలో కిరాణం, మండల కేంద్రంలో ఐరన్ షాపును నిర్వర్తిస్తూ కుటుంబపోషణ చేసున్నాడు. మృతుడికి భార్య ఉమ, కుమార్తెలు పల్లవి, నందిని ఉన్నారు. ఉప్పలయ్యకు కూతురుతలకొరవి పెట్టడంతో గ్రామస్థులు కంటతడి పెట్టారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సారంగపాణి (ఫైల్)

గార్ల సెప్టెంబరు 14 : మండల కేంద్రంలోని బెస్తబజార్ చెందిన కాముని సారంగపాణి 15 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోగా, ఆయన అన్న కాముని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. బిటెక్ కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన సారంగపాణి కొంతకాలం బెంగళూర్, విజయవాడ, ఉద్యోగం చేశాడు. ఆయన మానసికస్థితి బాగలేక పోవడంలో ఐదేండ్లుగా ఇంటివద్దే ఉంటూ, తిరుగుతున్నాడు. అయితే సారంగపాణి తిరిగిరాక పోవడంతో శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌ల ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంమోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్ రెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 14 : బీజేపీతోనే దేశ సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం తొర్రూరులో జరిగిన పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రధాని మోదీ అన్నివిధాలుగా కృషి చేస్తున్నాడని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు కలిగిన పార్టీగా బీజేపీ ఆవిష్కరించిందని, మోదీ నాయకత్వంలో ప్రజాసంక్షేమం ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. రెండునెలల పాటు కార్యకర్తలు పనిచేసి పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతమవుతుందన్నారు. సభ్యత్వాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బీజేపీ నాయకులు పల్లె కుమార్, దొంగరి మహేందర్, కోటేశ్వర్, సురేష్, పులేందర్, యాకయ్య, నవీన్, రాంబాబు, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి మురళీధర్

గార్ల సెప్టెంబరు 14 : వర్షాల ప్రభావంతో గ్రామాల్లో పారిశుధ్యం లోపించి, అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని.. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. శనివారం భారతీయ వికాస్ పరిషత్ మానుకోటవారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. ప్రజలు చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఈ శిబిరంలో ఖమ్మం, వరంగల్ పట్టణాల నుంచి పలువురు ప్రైవేటు వైద్యులు పాల్గొని, 500 మందికి పరీక్షలు చేసి మందులను అందజేశారు. బొబ్బిలిశెట్టి రామకృష్ణ, జయప్రకాశ్, విశ్వనాథం, ఆవుల శ్రీనివాస్ డాక్టర్ హనుమంతరావు, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కందునూరి శ్రీనివాస్, కట్టెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 14 : నిమజ్జన వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు గూడూరు పాకాల వాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వినాయకనిమజ్జనం కోసం పాకాల వాగుపై బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. సీఐ బాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భీమానాయక్ పాల్గొన్నారు.

'ఏచూరి మృతి సీపీఎంకు తీరని లోటు'

జీర్నకల్, సెప్టెంబరు 14 : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని రైతుసంఘం జిల్లా నాయకుడు శెట్టి వెంకన్న అన్నారు. శనివారం పెరుమాండ్ల సంకీసలో ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బొబ్బ వెంకట్‌రెడ్డి, గందు రవి, బొబ్బ లక్ష్మీ, ఉపేందర్, వెంకటప్పయ్య, సోమనబోయిన శ్రీను, రామగాని బిక్షం, మారు కొండయ్య పాల్గొన్నారు.

● కురవి : నిరుపేదల పక్షాన ప్రజాఉద్యమాలను ముందుకు తీసుకుపోవడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. కురవి సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాపసభను సీనియర్ నాయకుడు ఆమెడ నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. మీండల కార్యదర్శి మలెడి కోటయ్య, మాలోతు కిషన్, కట్ల కృష్ణ, గంధసిరి జ్యోతిబసు, కోలిపాక వీరేందర్, సరోజ, వినోద, అరుణ పాల్గొన్నారు.

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : దేశం గర్వించదగ్గ మేధావి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు సాదుల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు, కో-కన్వీనర్లు గుగులోతు సూర్య ప్రకాశ్, గంధసిరి జ్యోతిబసు, సభ్యులు వీరేందర్, రాకేష్, మహేష్, సురేష్, ప్రమీల, సోని, వినయ్ పాల్గొన్నారు.

● యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ సామ్యవాదం, లౌకికతత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఎస్‌కె.యాకూబ్, కృష్ణమూర్తి, సంజీవ, ప్రవీన్, శ్రీనివాస్, రాజశేఖర్, లక్ష్మయ్య, రాజు, బాబు పాల్గొన్నారు.



కురవిలో సీతారాం ఏచూరి ఫ్లెక్సీకి నివాళులు అర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు




సమావేశంలో మాట్లాడుతున్న చల్లా లింగారెడ్డి

సొసైటీ పరిధిలో రూ.4.58 కోట్ల రుణమాఫీ

● గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి

గూడూరు, సెప్టెంబరు 14 : గూడూరు సొసైటీ పరిధిలో 1240 మంది రైతులకుగాను రూ.7.45 కోట్ల వ్యవసాయ రుణాలు అందజేయగా అందులో 740 మంది రైతులకు రూ.4,58,080 మాఫీ అయినట్లు చైర్మన్ చల్లా లింగారెడ్డి తెలిపారు. గూడూరు సొసైటీలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు విడతలుగా రుణమాఫీ అయినట్లు పేర్కొన్నారు. గతంలో చెన్నారావుపేట సొసైటీ పరిధిలో ఉన్న గుండెంగ, మదనాపురం, గాజులగట్టు గ్రామాలను 2020లో గూడూరు సొసైటీలో విలీనం చేసినట్లు పేర్కొన్నారు. ఈ మూడు గ్రామాల రైతులకు గూడూరు సొసైటీలో సభ్యత్వం కానీ, వాటాధనం కానీ లేదని చెప్పారు. గుండెంగ, గాజులగట్టు, మదనాపురం గ్రామాల రైతులకు వ్యవసాయ రుణాలు ఇవ్వాలంటే రూ.2కోట్లు, గూడూరు సొసైటీ పరిధిలో పూర్తి స్థాయిలో రుణాలు ఇవ్వాలంటే మరో రూ.2 కోట్లు అవసరం ఉంటుందన్నారు. వెంటనే జిల్లా సహకార కేంద్రబ్యాంక్ చైర్మన్ స్పందించి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ వేం శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు నలమాస యాకయ్య కత్తి కృష్ణ, కందిక సంతోష, తవ్వాల జైపాల్, యాకూబ్‌పాషా, యాకాంబ్రం పాల్గొన్నారు.

స్నేహితుడి వైద్యానికి రూ.40 వేల సాయం



స్నేహితుడి కుటుంబానికి సహాయాన్ని అందజేస్తున్న 1994-95 బ్యాచ్ మిత్రులు

కేసముద్రం, సెప్టెంబర్ 14 : ధన్నసరికి చెందిన కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల వెంకట్‌రెడ్డి తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో ఉండగా, వైద్యఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబానికి 1994-95 క్లాస్మెట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.40వేలను శనివారం అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మదారి దినేష్ మాట్లాడుతూ మూడురోజుల్లో 54 మంది క్లాస్మేట్‌ల నుంచి ఈ డబ్బులను విరాళాలుగా సేకరించినట్లు చెప్పారు. బాల్యమిత్రుని కోసం స్నేహితులు సహాయం అందించడంపట్ల పలువురు అభినందించారు. కోశాధికారి మిడతనపల్లి ప్రకాశ్, బాణాల రఘు, ముంజ భిక్షపతి, కొండబోయిన శ్రీనివాస్, మంకు యాకూబ్‌రెడ్డి, తోడేటి మల్లేష్, రేసు వెంకటేశ్వర్లు, తాళ్లపల్లి విద్యాసాగర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి : డీఈవో

తొర్రూరు, సెప్టెంబరు 14 : కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీఈవో వి.రాజేశ్వర్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, ఇతర వసతులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లు, నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, మల్లేష్, ఎస్‌వో శైలజ ఉన్నారు.

పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

జీర్నకల్, సెప్టెంబరు 14 : రజాకార్లు, పెత్తందార్లు, దొరల నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వారు కమ్యూనిస్టులనేని సీపీఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. డోర్నకల్ మండల సీపీఐ ఆధ్వర్యంలో శనివారం పెరుమాండ్ల సంకీసలో ఉద్యమకారులను సజీవదహనం చేసిన ప్రాంతాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందు, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా బీజేపీ పార్టీ వక్రీకరిస్తుందని ఆరోపించారు. మ్యూనిస్టులదని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు నెల్లూరి నాగేశ్వర్‌రావు, తురక రమేష్, కర్నం రాజన్న, రమేష్, రామగోని రవి, వెంకటనారాయణ, లాలు, వీరన్న పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాల దిక్సూచి పీడీఎస్‌యూ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు14 : విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ప్రగతి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (పీడీఎస్‌యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షుడు నరసింహారావు అన్నారు. మహబూబాబాద్‌లో శనివారం పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యమ ప్రస్థానంలో ఎందరో విద్యార్థినేతలైన జార్జిరెడ్డి, చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీహరి, కోలాశంకర్, చేరాలు, రమణయ్య, సాంబయ్యలు అసువులు బాసారని తెలిపారు. బానోత్ నందీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నరేందర్, రామ్‌చరణ్, రవీందర్, గణేష్, లక్ష్మణ్, పూర్వ రాష్ట్ర నాయకులు ఫైండ్ల యాకయ్య పాల్గొన్నారు.